సాక్షి
అనంతపురం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17 వేలు పలికాయి.



టమాట కిలో రూ.23

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 ప్రకారం పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.19 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.8°/21.6°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి నుంచి పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సెప్టెంబరు 1న కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూభవన్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. అర్జీతో పాటు ఫోన్, ఆధార్ నంబర్లు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు. సమర్పించిన అర్జీల స్థితి గురించి కాల్‌సెంటర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. ప్రజలు తమ అర్జీలను 'పరిష్కార వేదిక' ద్వారానే కాకుండా meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్ లైన్‌లోనూ సమర్పించవచ్చని తెలియజేశారు.

ఇలాగైతే 'కౌశలం' ఎప్పటికి పూర్తవుతుంది?

అనంతపురం అర్బన్: 'కౌశలం సర్వే సంతృప్తి కరంగా జరగడం లేదు. ఇలాగైతే ఎప్పటికి పూర్తి చేస్తారు. వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామ,వార్డు సచివాలయాలకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి ఎంపీడీఓలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,14,145 మందిని సర్వే చేయాలని లక్ష్యం నిర్దేశించామన్నారు. ఇందులో ఇప్పటి వరకు 44,292 మందిని సర్వే చేశారని, ఇంకా 69,853 మందిని సర్వే చేయాల్సి ఉందన్నారు. గడువులోపు పూర్తికి రోజుకు 10 వేల మందిని సర్వే చేయాలని ఆదేశించారు. 'తల్లికివందనం' డబ్బులు రాని వారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆధార్ మ్యాపింగ్ పూర్తి చేయాలని చెప్పారు. మనమిత్ర క్యాంపెయిన్‌లో హౌస్‌హోల్డ్ పెండింగ్‌కు సంబంధించి రోజువారీ పురోగతి ఉండాలన్నారు.

దళితులను చితకబాదిన టీడీపీ నాయకులు



గార్లదిన్నె పోలీస్ స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న దళిత సంఘాల నాయకులు

గార్లదిన్నె: టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. దళితులను చితకబాదారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి గార్లదిన్నెలో చోటు చేసుకుంది. వివరాలు.. గార్లదిన్నె ఎస్సీ కాలనీలో కొలువు దీర్చిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం నిమజ్జనం చేయాలని స్థానికులు నిర్ణయించారు. రాత్రి ట్రాక్టర్‌లో వినాయకుడిని ఊరేగిస్తూ బస్టాండ్ సర్కిల్‌కు చేరుకోగా.. వారి వద్దకు కొందరు వచ్చి ట్రాక్టర్‌ను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వారు చెప్పినట్లుగానే ముందుకు వెళ్తుండగా ఓ వ్యక్తి వచ్చి ఎస్సీ కులానికి చెందిన యువకుడి చొక్కా పట్టుకున్నాడు. స్థానికులు కలగజేసుకొని సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అయితే, దళితుల ట్రాక్టర్ రైల్వే గేట్ దాటగానే టీడీపీ నాయకుడు, డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు తన అనుచరులతో అక్కడికి చేరుకుని దౌర్జన్యానికి దిగాడు. అందరూ కలిసి దళితులను భయభ్రాంతులకు గురి చేశారు. ఎస్సీ కులానికి చెందిన యువకులను చితకబాదారు. ఈ క్రమంలోనే దళితులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కొలుట్లయ్య అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

దళిత సంఘాల నిరసన..

దళితులపై దాడి చేసిన టీడీపీ నాయకులపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో దళిత సంఘాల నాయకులు శనివారం గార్లదిన్నె పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు లోలూరు కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్ నాయకుడు కదిరెప్ప మాట్లాడుతూ టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌నాయుడు దళితులను కులం పేరుతో దూషిస్తూ కట్టెలు, కొడవళ్లు, రాళ్లతో దాడి చేయడం సరికాదన్నారు. ఇళ్లు తగలబెడతామంటూ బెదిరించాడన్నారు. బాధితులు దీనిపై ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయకపోగా, కౌంటర్ కేసు పెడతామని పోలీసులు చెప్పడమేంటని ప్రశ్నించారు. ఎస్సీ,ఎస్టీ కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యాన్ని కలెక్టర్, ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. దళితులపై దాడులు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీఐ కొలుట్లయ్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో భారతీయ భీమ్ సేన వ్యవస్థాపకుడు రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడు ఓబిలేసు, రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలగానే పరిహారం

జాతీయ రహదారి నిర్మాణ క్రమంలో ఇళ్లు కోల్పోతున్న వారికి పరిహారం ప్రహసనంగా మారింది. ఏడాది దాటుతున్నా ఒక అడుగు ముందుకు... రెండడుగులు వెనక్కి అన్న చందాన సాగుతోంది. దీంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



జాతీయ రహదారి 544డీ నిర్మాణంలో భాగంగా బోడిగానిదొడ్డి (రోటరీపురం)లో కోల్పోనున్న ఇళ్లు

- ఎన్‌హెచ్ 544డీ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న 47 కుటుంబాలు
- రెండేళ్లు దాటుతున్నా అందని పరిహారం
- కలెక్టర్ ఆర్డర్‌పై కోర్టుకెళ్లిన ఎన్‌హెచ్ అధికారులు
- ఆందోళనకు గురవుతున్న నిర్వాసితులు

అనంతపురం అర్బన్: అనంతపురం రూరల్ మండలం పాములాయి నుంచి తాడిపత్రి మండలం బుగ్గ గ్రామం వరకు జాతీయ రహదారి 544–డీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రహదారి నిర్మాణ కోసం బుక్కరాయసముద్రం మండలం బోడిగానిదొడ్డి (రోటరీపురం)గ్రామంలో 130 ఇళ్లు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. దాదాపు రెండేళ్ల క్రితం నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి నిర్మాణ విలువను నిర్ధారించారు. రికార్డులు తయారు చేసే క్రమంలో 47 ఇళ్లకు సంబంధించి 112–2 సర్వే నంబర్‌ను రాళ్లగుట్టగా నమోదు చేశారు. వాస్తవంగా వీరంతా 50 ఏళ్ల కిత్రం ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. 1978లోనే ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. 1983లో డీ పట్టా మంజూరైంది. అయితే పరిహారం ఇచ్చేందుకు సిద్ధం చేసిన రికార్డులో రాళ్లగుట్టగా నమోదు చేయడంతో సమస్య తలెత్తింది. '544–డీ' నిర్మాణంలో కోల్పోతున్న 47 ఇళ్లకు తప్ప మిగిలిన ఇళ్ల వారికి పరిహారం ఇప్పటికే చెల్లించడం గమనార్హం.

రంగయ్య చొరవతో...

విషయాన్ని ఆలస్యంగా గుర్తించిన రెవెన్యూ అధికారులు దాన్ని సరిదిద్ది మరో మారు నివేదికను పంపినా కేంద్ర రహదారుల మంత్రిత్వశాఖ క్లియరెన్స్ రాలేదు. దీనిపై అప్పటి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడారు. అప్పట్లో ఎంపీగా ఉన్న తలారి రంగయ్య ప్రత్యేక చొరవ తీసుకుని కేంద్ర పెద్దలతో మాట్లాడి నిర్వాసితులకు పరిహారం అందించేందుకు మార్గం సుగమం చేశారు. ఈ క్రమంలోనే నిర్వాసితులు సంతృప్తి చెందేలా ధర నిర్ణయిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. కలెక్టర్ జారీ చేసిన ఈ ఉత్తర్వులపై ఎన్‌హెచ్ అధికారులు కోర్టును ఆశ్రయించడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. రెవెన్యూ శాఖ తరఫున కోర్టులో సరైన వాదనలు వినిపించని కారణంగా తీర్పు జాతీయ రహదారి శాఖకు అనుకూలంగా వచ్చిందని అధికారవర్గాలు చెబుతుండడం గమనార్హం.

దయ చూపాలి



జాతీయ రహదారి కోసం ఇల్లు, రెండు సెంట్ల స్థలం కోల్పోతాం. మా ఉరిలో మాకు తప్ప రోడ్డుకు పోతున్న మిగిలిన వాళ్లందరికీ పరిహారం అందింది. మాకు పరిహారం రాక పోతే తీవ్ర ఇబందులకు గురవుతాం. అధికారులే దయచూపి ఆదుకోవాలి.

– కళావతి, నిర్వాసితురాలు, బోడిగానిదొడ్డి

డబ్బులు రాకపోతే ఇబ్బంది



మేము ఇంటితో పాటు ఒకటిన్నర సెంటు స్థలం కోల్పోతున్నాం. రోడ్డుకు పోతుందని మా ఇంటికి కొలతలు వేశారు. మాలాగా కోల్పోతున్న ఇళ్లకు, స్థలాలకు పరిహారం ఇచ్చారు. మాకు మాత్రం ఇప్పటి వరకు ఇవ్వలేదు. డబ్బులు రాకపోతే చాలా ఇబ్బంది పడతాం.

– లక్ష్మీదేవి, నిర్వాసితురాలు, బోడిగానిదొడ్డి

పరిహారం వస్తుందో.. రాదో?



ఇల్లు నిర్మించుకుని 50 ఏళ్లుగా నివాసముంటున్నాం. 1983లో మాకు పట్టాలు ఇచ్చారు. రోడ్డు నిర్మాణంలో అన్ని ఇళ్లనూ కొలిచి మార్కింగ్ ఇచ్చారు. 47 కుటుంబాలకు సంబంధించిన సర్వే నంబరు 112–2ను రాళ్లగుట్టగా నమోదు చేశారు.దీన్ని సరిచేసి పంపినా ఇప్పటికీ పరిహారం అందలేదు. వస్తుందో రాదో అర్థం కాక తీవ్ర ఆందోళన చెందుతున్నాం.

– క్రిష్ట, నిర్వాసితుడు, బోడిగానిదొడ్డి

కోర్టు ఆర్డర్ పరిశీలిస్తా



జాతీయ రహదారి నిర్మాణ క్రమంలో బోడిగానిదొడ్డి గ్రామంలో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారంపై ఆర్డర్ పాస్ చేశా. నేనిచ్చిన ఆర్డర్‌పై ఎన్‌ఎచ్ అధికారులు కోర్టుకెళ్లారు. కోర్టు ఆర్డర్ ఇంకా నాకు చేరలేదు. అందిన తరువాత దానిని పరిశీలించి ఏం చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

ప్రశాంత నిమజ్జనానికి సహకరించండి

- ఎస్పీ జగదీష్



అనంతపురం/అనంతపురం కల్చరల్: గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకారమందించాలని ఎస్పీ జగదీష్ కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం విగ్రహాల నిమజ్జనోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేపట్టామన్నారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత పోలీసులకు సహకరించాలన్నారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచుతామన్నారు. క్రమపద్ధతిలో విగ్రహాలు కదిలేలా వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బాణ సంచా కాల్చడం, మద్యపానం సేవించడం చేయరాదని సూచించారు. పోలీసులు సూచించిన రూట్లలోనే శోభాయాత్ర సాగించాలన్నారు. రూట్ నంబర్–1లో తాడిపత్రి బస్టాండు, బసవన్నకట్ట, సూర్యానగర్ సర్కిల్, జేఎన్‌టీయూ, కలెక్టరేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల ఊరేగింపు సప్తగిరి సర్కిల్‌లో కలుస్తుందన్నారు. రూట్ నంబర్–2లో ఒకటో రోడ్డు నుంచి ఆరో రోడ్డు, రామచంద్రానగర్ నుంచి వైపు వచ్చే విగ్రహాలు సైఫుల్లా బ్రిడ్జి మీదుగా శ్రీకంఠం సర్కిల్ వద్ద కలిసి ఎన్టీఆర్ సర్కిల్, టవర్‌క్లాక్, పీటీసీ ప్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా నడిమివంక చేరుకోవాలన్నారు. రూట్ నంబర్–3లో రుద్రంపేట, రామ్‌నగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీల వైపు నుంచి వచ్చే విగ్రహాలు రామ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా ప్రభుత్వ సర్వజనా సుపత్రి, తెలుగుతల్లి సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్ చేరుకుంటాయన్నారు. పెద్ద విగ్రహాలను ఆత్మకూరు మండలం వడ్డిపల్లి వద్ద హంద్రీ–నీవా కాలువలో నిమజ్జనం చేయాల్సి ఉంటుందన్నారు. చిన్న వాటిని అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి చెక్ డ్యాం వద్ద నిమజ్జనం చేయాలన్నారు.

అరాచకాలను అరికట్టండి

- జిల్లాలో గాడి తప్పిన లా అండ్ ఆర్డర్
- వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు
- మహిళలపై అధికమైన అకృత్యాలు
- ఎస్పీ జగదీష్‌ను కలిసి విన్నవించిన వైఎస్సార్‌సీపీ నేతలు అనంత, రంగయ్య



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ కళ్యాణదుర్గం సమన్వయకర్త రంగయ్య తదితరులు

అనంతపురం: కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో సాగుతున్న అరాచకాలను అరికట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామి రెడ్డి, పార్టీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య కోరారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్‌ను కలిసి జిల్లాలో అదుపుతప్పిన శాంతిభద్రతలను వివరించారు.కళ్యాణ దుర్గం, అనంతపురం, తాడిపత్రి, రాప్తాడు నియోజక వర్గాల్లో పోలీసింగ్ నిర్వీర్యమైందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులు పెరిగాయన్నారు. మహిళలపైనా అకృత్యాలు అధికమయ్యాయన్నారు. టీడీపీ నాయకులు చెప్పిందే వేదం అన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారన్నారు. సీఐలు పంచాయితీలు చేస్తూ కూటమి నేతలకు వత్తాసు పలుకుతున్నారన్నారు. గంజాయి, పేకాట, అధిక వడ్డీలు, మట్కా వంటి అసాంఘిక కార్యకలాపాలు అధికమయ్యాయన్నారు. పైసాపైసా కూడబెట్టి కొనుగోలు చేసిన స్థలాలను సైతం కబ్జా చేస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి అడుగు పెట్టనీయని పరిస్థితి నెలకొందన్నారు. తాజాగా సుప్రీంకోర్టే అనుమతి ఇచ్చిందని ఎస్పీ వద్ద ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే భర్త శాంతకుమార్‌కు టీడీపీ నాయకుల వేధింపులు తాళలేక కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో గొల్ల మమత తన మూడేళ్ల కుమార్తె లాస్యతో కలిసి తానూ ఆత్మహత్య చేసుకుందని వాపోయారు. అప్పట్లో సీఐ హరినాథ్ రోజూ ఉదయాన్నే శాంతకుమార్‌ను పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టి వేధించేవాడని, భర్తకు ఏమైనా జరుగుతుందని భయపడిన ఆమె బలవన్మరణానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై టీడీపీ నాయకులు దుప్పటి పంచాయితీ చేసి శాంతకుమార్‌ను బెదిరించి కేసు పెట్టకుండా రాజీ చేసుకున్నారని ఆరోపించారు. బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన వితంతువు లక్ష్మి తన కుమార్తెకు హాస్టల్ సీటు కోసం టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు అనుచరుడైన వన్నూరుస్వామి సాయం కోరితే లైంగిక వాంఛ తీర్చాలని ఆమెను వేధింపులకు గురిచేశాడన్నారు. కళ్యాణదుర్గంలో దొడగట్ట రోడ్డులో నివసిస్తున్న తలారి శ్రావణి ఆత్మహత్యకు ముందు టీడీపీ నాయకుల అండతో తన భర్త, అత్తమామలు వేధించారని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ నాయకులైన వైపీ రమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ శర్మాస్ వలి ఎమ్మెల్యే సురేంద్రబాబుకు ప్రధాన అనుచరులని, వీరు పట్టణంలో ప్రతి పనికిమాలిన పనికీ ఆసరాగా ఉంటున్నారని ఆరోపించారు. శ్రావణి తన మరణ వాంగ్మూలంలో పేర్కొన్న మాటలను పరిగణనలోకి తీసుకుంటే వీరి ప్రవర్తన ఎలా ఉంటుందో అర్థమవుతుందన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ర్యాలీకి అనుమతి ఇవ్వండి..

ఉమ్మడి అనంతపురం జిల్లాకు కల్పతరువు లాంటి ఆర్డీటీ పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ నిర్విరామ పోరాటం చేస్తోందని అనంత, రంగయ్య చెప్పారు. ఈ క్రమంలో పార్టీ ఆధ్వర్యంలో అతిపెద్ద బైక్ ర్యాలీ నిర్వహించ తలపెట్టామని, ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా లాటరీ

- 15 నిమిషాల్లోనే ముగిసిన ప్రక్రియ



అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీస్తున్న దృశ్యం

అనంతపురం: బార్ల లాటరీ ప్రక్రియ తూతూ మంత్రంగా ముగిసింది. బార్ల కోసం టీడీపీ చేసిన సిండికేట్ కుట్ర ఫలించింది. జిల్లాలో 19 బార్లకు నోటిఫికేషన్ ఇవ్వగా కేవలం 10 బార్లకు దరఖాస్తులు వచ్చాయి. ఇందులోనూ సింహభాగం ఒక వ్యక్తే నాలుగు దరఖాస్తులు (కనీసం ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు రావాలనే నిబంధన) అందించి కోరుకున్న బార్ దక్కించుకున్నాడు. ఒక్కో వ్యక్తి ఎన్ని దరఖాస్తులు అయినా వేసుకోవచ్చని కొత్త నిబంధన తెరపైకి తేవడంతో ఇదే అదనుగా టీడీపీ నాయకులు సిండికేట్ అయి దరఖాస్తు చేశారు. కోరుకున్న బార్‌కు నాలుగు దరఖాస్తులు ఒకే పేరుతో అందించి.. దక్కించుకున్నారు. ఎవరూ ముందుకు రాకుండా వారే పంపకాలు చేసుకున్నారు.

అలా వచ్చి.. ఇలా వెళ్లారు

అనంతపురం జెడ్పీ కార్యాలయంలో శనివారం లక్కీ డ్రా తీశారు. జిల్లాలో 10 ఓపెన్ కేటగిరీ బార్లకు, 2 గీత కులాల బార్లకు లక్కీ డ్రా తీశారు. ఓపెన్ కేటగిరీ బార్లకు 40 దరఖాస్తులు, గీత కులాల బార్లకు 10 దరఖాస్తులు అందాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. రామ్మోహన్ రెడ్డి, ఏఈఎస్ రేవతి సమక్షంలో డ్రా తీశారు. అనంతపురం మునిసిపల్ పరిధిలో 7, తాడిపత్రిలో మూడు బార్లకు లక్కీ డ్రా జరిగింది. అనంతపురం నగరంలో గీత కులాలకు కేటాయించిన రెండు బార్లకు లాటరీ నిర్వహించారు. ఉదయం 8 గంటలకు లక్కీ డ్రా ప్రారంభించారు. 15 నిమిషాలు కరెంట్ లేదు. ఈ క్రమంలో 8:15 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభించి.. కేవలం 15 నిమిషాల్లో ముగించేయడం గమనార్హం. ఒక్కో బార్‌కు కేవలం నాలుగు దరఖాస్తులే వచ్చాయి. రావాల్సిన దరఖాస్తులు నాలుగే కావడంతో ఆ మేరకు వచ్చాయా అని అధికారులు అనడం.. వచ్చాయి సార్ అని సిబ్బంది చెప్పడం.. తర్వాత వెంటనే పేరును ప్రకటించేయడం ఇలా వేగంగా ముగించేశారు. ఇక.. 9 బార్లకు లాటరీ నిర్వహించలేదు. వీటి కోసం ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడమే ఇందుకు కారణం. తొలుత బాగా ఆదాయం ఉన్న ప్రాంతాల్లో బార్లను చేజిక్కించుకున్నారని, అనంతరం వాయిదాపడ్డ వాటిని దక్కించుకునేందుకు పన్నాగం పన్నినట్లు తెలిసింది.

రయ్..రయ్



స్పోర్ట్స్ బైక్‌లో వెళుతున్న యువకుడు

శింగనమల: నార్పల మండలంలోని హెచ్చెల్సీ కెనాల్ నుంచి పుట్లూరు మండలంలోని మడుగుపల్లి కనం వరకు శనివారం బైక్, కారు రేసింగ్ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన మోటార్ స్పోర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రేసింగ్‌ను తిలకించడానికి జనం పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ఆదివారం వరకు రేసింగ్ కొనసాగనుంది. ఉన్నతాధికారుల అనుమతితోనే రేసింగ్ నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.



రేసింగ్‌లో పాల్గొన్న కారు

తీరిన గడువు.. కలసిరాని కొలువు

- టీచరు పోస్టుకు ఎంపికైనా గడువులోగా విద్యార్హత సర్టిఫికెట్లు లేని కారణంగా తిరస్కరణ
- ముగ్గురు అభ్యర్థుల నుంచి నాట్‌విల్లింగ్ తీసుకున్న అధికారులు
- మరో ముగ్గురు అభ్యర్థుల దరఖాస్తులూ పక్కకు..
- పూర్తయిన డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: వేలాదిమంది పోటీపడినా ప్రతిభ చాటి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికయ్యాడు. సంబంధిత బీపీఈడీ కోర్సు గడువులోపు పూర్తి చేయని కారణంగా ఉద్యోగానికి అనర్హుడయ్యాడు. తొలిరెండు రోజులు గైర్హాజరైన వారి కోసం మూడోరోజు శనివారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగించారు. మొత్తం 787 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు వచ్చాయి. వీరిలో 748 మంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. తక్కిన 9 మందిని పిలిపించి అర్హులా కాదా? అని పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలంటూ రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు అందాయి. ఈ క్రమంలో ఆ 9 మంది అభ్యర్థులను పిలిపించారు. వీరిలో ముగ్గురు శ్రీకాంత్, లక్ష్మీదేవి, శ్రీనివాసులు సర్టిఫికెట్లు జత చేయడంతో అప్‌లోడ్ చేశారు. దాసరి మహేష్ కుమార్ అనే అభ్యర్థి ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికయ్యాడు. అయితే ఈయనకు మార్చి 15 నాటికి బీపీఈడీ కోర్సు సర్టిఫికెట్లు లేవు. ఆగస్టులో ఉత్తీర్ణత సాధించాడు. ఈ కారణంగా అనర్హత వేటు వేశారు. అలాగే మరో అభ్యర్థి చంద్రమౌళి పీహెచ్ కోటాలో ఎంపికయ్యాడు. సర్టిఫికెట్‌లో వైకల్య శాతం తక్కువగా ఉన్న కారణంగా తిరస్కరించారు. ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టుకు ఎంపికైన కొండమ్మ... కేజీబీవీలో పని చేస్తూ బీపీఈడీ కోర్సు చేశారు. ఫిర్యాదు అందిన కారణంగా సంబంధిత సర్టిఫికెట్లు (బీపీఈడీ కోర్సు చేస్తున్న సమయంలో కేజీబీవీలో పని చేస్తూ జీతం తీసుకున్నట్లు) తెప్పించుకుని పరిశీలించి ఆమెపై అనర్హత వేటు వేశారు. ప్రిన్సిపాల్ పోస్టుకు ఎంపికైన జి.వెంకటరమణ,ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద ఎంపికైన మరో అభ్యర్థి హనుమంతరాయప్ప, ఇంకో అభ్యర్థి రామకృష్ణప్రసాద్‌లు ముగ్గురూ నాట్ విల్లింగ్ ఇచ్చారు. నాట్ విల్లింగ్, అర్హత లేని వారి మొబైళ్లకు ఓటీపీలు పంపి తద్వారా ఆయా పోస్టులకు అనర్హులుగా ధ్రువీకరించారు.

ఇంకా 50 పోస్టుల సమాచారం ఏదీ?

జిల్లాలో మొత్తం 807 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. మూడు రోజులుగా 757 మంది అభ్యర్థులను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. తక్కిన 50 పోస్టుల సంగతేంటనే దానిపై ఇక్కడి అధికారులకు స్పష్టత లేదు. 757 మందిలో ఏ కేటగిరీ పోస్టులకు ఎంతమంది వచ్చారనే సమాచారం కూడా వీరివద్ద లేదు. అభ్యర్థుల పేర్లు, ఐడీ, తండ్రిపేరు, ఫోన్‌నం. తదితర వివరాలు తప్ప వారు ఏసబ్జెక్టు అనే వివరాలు కల్గిన జాబితాలు ఎక్కడా కనిపించవు. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో వారికి కేటాయించిన టీం వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో అభ్యర్థి ఐడీ ఎంటర్ చేస్తే అక్కడ మాత్రమే ఈ పోస్టుకు అర్హుడని కనిపిస్తోంది. వ్యక్తిగత సమాచారం తప్పితే పూర్తి వివరాలు కల్గిన అందరి జాబితా తమకు అందలేదని అధికారులు చెబుతున్నారు. అనర్హులు, నాట్‌విల్లింగ్ ఇచ్చిన అభ్యర్థులకు సంబంధించి అదే కేటగిరీలో తర్వాత ఉన్న అభ్యర్థులకు అవకాశం ఇస్తారని, దీనిపై రాష్ట్ర అధికారులే స్పష్టత ఇస్తారని చెబుతున్నారు.

హలో అనగానే ఖాతాలో రూ. లక్ష మాయం

తాడిపత్రిటౌన్: సెల్‌ఫోన్‌లో హలో అన్నాడో లేదో క్షణాల్లో బ్యాంకు ఖాతా నుంచి రూ. లక్ష మాయమైంది. బాధితుడు తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా బనగానపల్లెకు చెందిన శివకుమార్ వినాయక చవితికి అత్తగారి గ్రామమైన తాడిపత్రికి వచ్చాడు. శనివారం వాట్సాప్‌లో గుర్తు తెలియని నంబర్ నుంచి గుడ్‌మార్నింగ్ అంటూ మెసేజ్ రాగా శివకుమార్ స్పందించలేదు. సాయంత్రం మళ్లీ అదే నంబర్ నుంచి వాట్సాప్ కాల్ రాగా లిఫ్ట్ చేశాడు. అవతలి వైపు నుంచి ఎవరూ మాట్లాడకపోవడంతో కాల్ కట్ చేశాడు. ఈ క్రమంలోనే తన బ్యాంకు ఖాతా నుంచి రూ.1,04,330 కట్ అయినట్లు మెసేజ్ రావడంతో శివకుమార్ హతాశుడయ్యాడు. వెంటనే తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు.

క్లుప్తంగా

ఇద్దరికి ప్రొఫెసర్లుగా పదోన్నతి


డాక్టర్ రాజేష్


డాక్టర్ శారద

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రొఫెసర్ పోస్టులకు కౌన్సెలింగ్ జరిగింది. కాగా ఈఎన్‌టీ విభాగానికి సంబంధించి అసోసియేట్ ప్రొఫెసర్, ప్రస్తుత ఇన్‌చార్జ్ హెచ్‌ఓడీగా ఉన్న డాక్టర్ రాజేష్‌కుమార్‌కు, మానసిక వైద్య విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ శారదకు ప్రొఫెసర్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా తోటి వైద్యులు, కిందిస్థాయి సిబ్బంది వారికి అభినందనలు తెలిపారు. వీరిద్దరికీ అనంతపురం సర్వజనాస్పత్రిలోనే పోస్టింగ్ వచ్చింది.

ఎట్టకేలకు ఎరువులు వచ్చాయ్

అనంతపురం అగ్రికల్చర్: ఎట్టకేలకు యూరియాతో పాటు కాంప్లెక్స్ ఎరువులు శనివారం అనంతపురం చేరాయి. ఆర్‌సీఎఫ్ కంపెనీ నుంచి వచ్చిన ఎరువులకు స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌తో పాటు విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్ తదితరులు పరిశీలించారు. 500 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా.. అందులో మార్క్‌ఫెడ్ 350 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ హోల్‌సేల్‌డీలర్లకు 150 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు ఏడీఏ తెలిపారు. ఇందులో అనంతపురం జిల్లాకు 388 మెట్రిక్ టన్నులు కాగా.. శ్రీసత్యసాయి జిల్లాకు 112 మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తామని వెల్లడించారు. ఇక 15-15-15 రకం కాంప్లెక్స్ ఎరువులు 854 మెట్రిక్ టన్నులు రాగా.. అందులో అనంతపురం జిల్లాకు 574 మెట్రిక్ టన్నులు, శ్రీసత్యసాయి జిల్లాకు 280 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు.

వైద్య విద్య కార్యక్రమాలతో నూతన ఆవిష్కరణలు

అనంతపురం మెడికల్: నిరంతర వైద్య విద్య కార్యక్రమాల ద్వారా నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మైక్రో బయాలజీ విభాగానికి సంబంధించి సీఎంఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. వైద్య కళాశాలలో యూజీ, పీజీ సీట్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. వైద్యులు నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధుసూదన్, ప్రొఫెసర్ శాంతిరెడ్డి, డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు పాల్గొన్నారు.

రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం: గ్రామీణ నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ వర్క్స్ (జరీ), ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి తెలిపారు. సెప్టెంబర్ 10, 15, 16 తేదీల్లో ఆయా బ్యాచ్‌లకు శిక్షణ మొదలవుతుందని పేర్కొన్నారు. శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజనం కల్పిస్తామని వెల్లడించారు. 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసుండి, చదవడం, రాయడం వచ్చిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 96188 76060, 94925 83484 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కన్నీరు తెప్పిస్తున్న ఉల్లి

● అథఃపాతాళానికి పడిపోయిన ధరలు ● పట్టించుకోని కూటమి ప్రభుత్వం ● లబోదిబోమంటున్న రైతులు





గుమ్మఘట్ట: ఉల్లి ధరలు దారుణంగా పతనమయ్యాయి. ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పంట పండించిన రైతులకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని లబోదిబోమంటున్నారు. జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఐదు వేల ఎకరాల విస్తీర్ణంలో ఉల్లి సాగు చేశారు. ఇందులో ఒక్క గుమ్మఘట్ట మండలంలోనే 2,500 ఎకరాల్లో ఉల్లి సాగు చేయడం గమనార్హం. విత్తనం, ఎరువులు, కలుపు తీత కూలితో సహా ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంట చేతికి వచ్చే సమయానికి ధరలు అథఃపాతాళానికి పడిపోయాయి. క్వింటాలు ధర రూ.600కు మించడంలేదు. గిట్టుబాటు ధరతో ఉల్లిని కొనుగోలు చేయడానికి కూటమి ప్రభుత్వం ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. బెంగళూరు, రాజమండ్రి, కర్నూలు, కోల్‌కతా మార్కెట్‌లకు తీసుకెళ్లినా సరైన ధర లేకపోవడంతో అమ్ముకోలేక.. వెనక్కు తీసుకురాలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడిగేనాథులే లేరు

ఉల్లి పంట బాగా పండింది. ఈసారి అప్పులు తీరుతాయని కుటుంబ సభ్యులంతా సంతోషపడ్డాం. అయితే పంట చేతికొచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. ఉల్లి కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాలేని పరిస్థితి నెలకొంది. పెట్టుబడులు కూడా తిరిగి వచ్చేలా లేవు. మళ్లీ అప్పుల ఊబిలోకి కూరుకుపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మా తలరాతలు ఎప్పుడు మారతాయో అర్థం కావడం లేదు.

– రామాంజిని, రైతు, పూలకుంట

రైతులను ఆదుకోవాలి



బోరుబావుల కింద రెండు ఎకరాల్లో ఉల్లి పంట వేశాను. మంచి దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధరలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పంటకు పెట్టిన ఖర్చులు కూడా తిరిగి రాకపోతే ఎలా బతికేది. గిట్టుబాటు ధర ప్రకటించి.. మార్కెటింగ్ సదుపాయం కల్పించి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– దయానందరెడ్డి, రైతు, ఆర్.కొత్తపల్లి

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



ఉల్లికి కూటమి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి.. రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేయాలి. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించి ఆదుకోవాలి. రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వమే ఉల్లి పంటను కొనుగోలు చేసి.. రైతులకు భరోసా కల్పించింది.

– మెట్టు గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, రాయదుర్గం

చంటి బిడ్డతో వేచివున్నా.. ఆపని బస్సులు


డ్రైవర్‌ను మందలిస్తున్న స్థానికులు

బత్తలపల్లి: బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం ముందు శనివారం ఉదయం 11.30 గంటలకు ఓ మహిళ చంటి బిడ్డతో ధర్మవరం వెళ్లేందుకు బస్సు కోసం రోడ్డుపైనే ఎండలో వేచి ఉంది. బస్సులు ఒకదాని వెంట మరొకటి వస్తున్నాయి. వచ్చిన ప్రతి బస్సునూ ఆ మహిళ ఆపేందుకు చేయి ఎత్తుతోంది. బస్సు డ్రైవర్లు మాత్రం చూసి కూడా ఆపకుండానే వెళ్లిపోతున్నారు. ఫ్రీ టికెట్..ఎందుకు ఆపాలని అనుకున్నారో ఏమో.. చంటి బిడ్డతో వేచి ఉందన్న కనీస మానవత్వం కూడా లేకుండానే వెళ్లిపోయారు. ఇలా ఐదు బస్సులు వెళ్లాయి. అప్పటికి 12 గంటలు అయింది. చివరికి అక్కడున్న వారికి ఈ తతంగం ఆగ్రహం తెప్పించింది. ఆ సమయంలో ధర్మవరం డిపోకు చెందిన ధర్మవరం-పులివెందుల బస్సు వచ్చింది. ఆ బస్సు కూడా ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు ద్విచక్ర వాహనంలో వెంబడించారు. జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద బస్సును అడ్డుకున్నారు. డ్రైవర్‌తో ఘర్షణకు దిగారు. ఓ మహిళ చంటి బిడ్డతో ఎండలో ఉందన్న మానవత్వం కూడా లేకుండా ఎలా వెళ్లిపోతారంటూ నిలదీశారు. తర్వాత ఆ మహిళను బస్సులో ఎక్కించి పంపించారు. మహిళలకు ఎలాగూ ఫ్రీనే కదా అనే ఉద్దేశంతో చాలావరకు బస్సులు ఆపడంలేదని పలువురు తెలిపారు.

భూ ఆక్రమణదారులపై చర్యలకు డిమాండ్


డీటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

కూడేరు: బ్రాహ్మణపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న అగ్రిగోల్డ్ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్దేశ్వర, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప డిమాండ్ చేశారు. శనివారం వారు అగ్రిగోల్డ్ బాధితులు, సీపీఐ నేతలతో కలిసి అగ్రిగోల్డ్ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సర్వే నంబర్ 19-1, 19-2, 19-3లోని భూమిలో అగ్రిగోల్డ్ సంస్థ ఇది వరకు వెంచర్ ఏర్పాటు చేసిందన్నారు. చిరు వ్యాపారులు, ఉద్యోగులు, మధ్య తరగతి కుటుంబాల వారు పిల్లల భవిష్యత్ కోసం అగ్రిగోల్డ్‌లో డబ్బు పొదుపు చేసుకొని ప్లాట్లు కొనుగోలు చేసుకున్నారన్నారు. కానీ సంస్థలో పని చేసే కొందరు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్ చేయించి సొమ్ము చేసుకొని వారికి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ భూమిని కొందరు ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. వారిపై అధికారులు క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ భాస్కర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు కేశవరెడ్డి, తాలూకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి పెరుగు సంగప్ప, మండల కార్యదర్శి నాగేంద్ర, రైతు సంఘం నేతలు రమణ, శ్రీరాములు, నారాయణమ్మ, మలరాయుడు, వెంకటేశులు పాల్గొన్నారు.

వ్యసనాలకు అలవాటుపడి.. దొంగగా మారి..


అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యబాబు

పుట్లూరు: వ్యసనాలు ఆ యువకుడిని దొంగగా మార్చాయి. చోరీలు చేస్తూ వచ్చిన సొమ్ముతో జల్సాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ సత్యబాబు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండల కేంద్రం పుట్లూరులోని బీసీ కాలనీలో ఈ నెల 22న చోరీ జరిగింది. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీలు జరిగిన తీరు, పాత నేరస్తుల కదలికలతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెట్టారు. బీసీ కాలనీకి చెందిన దాసప్పగారి బాలచంద్ర అలియాస్ బాలును అనుమానితునిగా అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. బీసీ కాలనీలో జరిగిన చోరీతో పాటు గ్రామంలోని జనరల్ స్టోర్‌లో జరిగిన దొంగతనం కూడా బాలునే చేసినట్లు విచారణలో తేల్చారు. కూలి పనులు చేసుకునే ఇతడు ఆన్‌లైన్ గేమ్, పేకాట తదితర జూదాలకు డబ్బు అవసరమై దొంగతనాల బాట ఎంచుకున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. ఈ మేరకు బాలును శనివారం అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి మూడు జతల బంగారు కమ్మలు, 8 గ్రాముల చైన్, రెండు ఉంగరాలు, 25 తులాల వెండి గొలుసులతో పాటు జనరల్ స్టోర్‌లో చోరీ చేసిన రూ.7,450 నగదును రికవరీ చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో యల్లనూరు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, ట్రైనీ ఎస్‌ఐలు రామక్రిష్ణ, సురేష్, కానిస్టేబుళ్లు వెంకటేష్, షెక్షావలి, నరేష్, రాము, రమేష్ పాల్గొన్నారు.

నిమజ్జనం.. జర భద్రం!

● జాగ్రత్తలు పాటిస్తే క్షేమం
● నేడు జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనాలు


గంగ ఒడికి చేరుతున్న వినాయకుడు

రాయదుర్గం/ఉరవకొండ రూరల్: జిల్లా అంతటా వినాయక చవితి సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. విభిన్న రూపాల్లో కొలువుదీరిన ఆదిదేవుడ్ని జనం భక్తితో పూజిస్తూ పరవశించిపోతున్నారు. పర్యావరణ పరిరక్షణకు పలు చోట్ల మట్టి వినాయకులను ప్రతిష్టించి పూజిస్తున్నారు. మంటపాల్లో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే ఉత్సవాలతో పాటే ప్రమాదాలు పొంచి ఉన్నాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి. ఎంతో ఆనందంగా జరుపుకునే వేడుకల్లో చిన్న పొరపాట్లకు తావిచ్చి కుటుంబాల్లో విషాదం నింపకుండా చూసుకోవాలి. ముఖ్యంగా నిమజ్జనోత్సవాల్లో అపశ్రుతులు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఐదో రోజు ఆదివారం జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం కోలాహలంగా జరగనుంది. వినాయక విగ్రహాల శోభాయాత్ర- నిమజ్జన ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

డ్రైవర్ పాత్ర కీలకం

నిమజ్జన శోభాయాత్రలో ప్రధానంగా ఆయా వినాయక ప్రతిమలను ఊరేగించే వాహనాల డ్రైవర్లు అనుభవజ్ఞులై ఉండాలి. ప్రతిమలను చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వస్తుంటారు. పొరపాట్లు జరగకుండా ముందుగానే సదరు డ్రైవర్లకు పోలీసులతో పాటు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సలహాలు, సూచనలు ఇవ్వాలి. డ్రైవింగ్ చేసే సమయంలో మద్యం, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి. ముందు, వెనుక, ఇరుపక్కలా గమనిస్తూ డ్రైవింగ్ చేయాలి. డ్రైవర్ పక్కన ఎవ్వరినీ కూర్చోనివ్వరాదు. రోడ్లపై గతుకులు, గుంతలు, స్పీడ్ బ్రేకర్ల వద్ద జాగరూకతతో నడపాలి. విద్యుత్ తీగల విషయంలో అప్రమత్తతతో వ్యవహరించాలి. ప్రతిమ వద్ద ఎక్కువ మంది జనం లేకుండా చూసుకోవాలి.

అప్రమత్తంగా ఉండాలి

గణేశ్ నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమంలో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు తగిన జాగ్రత్తలు చెప్పి బయటకు పంపాలి. నిమజ్జనానికి చిన్నారులను ఒంటరిగా పంపడం మంచిదికాదు. తెలిసిన వారితో లేదా కుటుంబ సభ్యులు తోడుగా ఉండేలా చూసుకోవాలి. శోభయాత్రను తిలకించేందుకు మేడలు, రేకుల షెడ్లు, పాత మిద్దెలు ఎక్కినపుడు జాగ్రత్తగా ఉండాలి.

క్యూ పాటించాలి

నిమజ్జనోత్సవంలో క్యూ పద్ధతి పాటించాలి. ఒక వాహనం తర్వాత ఇంకో వాహనం వెళితే ఎవరికీ ఇబ్బందులు ఉండవు. భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.

నీటితో ఆటలొద్దు..

ప్రతిమలను నీరు ప్రవహించే చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, లోతైన వాటిల్లో నిమజ్జనం చేస్తారు. ఇలాంటి సమయాల్లో చాలా జాగ్రత్తలు పాటించాలి. నిమజ్జన సమయంలో అధికార యంత్రాంగం ఏర్పాటు చేసే క్రేన్, తదితర వాటి సమీపంలోకి వెళ్లకూడదు. నీటి లోపలికి ఎవరూ వెళ్లకూడదు. అందులోనూ ఈత రాని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ నీళ్లలోకి దిగకూడదు.

ప్రశాంతంగా నిర్వహించాలి

వినాయక విగ్రహాల నిమజ్జనం- శోభాయాత్ర ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలి. ఐదో రోజు ఆదివారం నిమజ్జన కార్యక్రమంలో అపశ్రుతులు చోటు చేసుకోకుండా నిర్వాహకులు, కమిటీ సభ్యులు జాగ్రత్తలు పాటించాలి. తొందరపాటుతో ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దు. పోలీసుల సలహా, సూచనలు తప్పక పాటించాలి.

– పి. జగదీష్, ఎస్పీ

జిల్లాకు 'సీస్' అమౌంట్ ఇవ్వడంలో నిర్లక్ష్యం వీడాలి

అనంతపురం ఎడ్యుకేషన్: స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (సీస్)కు సంబంధించిన బడ్జెట్ జిల్లాకు ఇవ్వడంలో సమగ్రశిక్ష రాష్ట్ర అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఎంఈఓ-2 సంఘం రాష్ట్ర నాయకులు హెచ్.రామచంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన అనంతపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2023లో జరిగిన సర్వేకు సంబంధించి రాష్ట్రంలోని అనంతపురం జిల్లా తప్ప తక్కిన అన్ని జిల్లాల్లోనూ అప్పట్లోనే నిధులు ఖర్చు చేశారన్నారు. జిల్లాకు కూడా రూ.20.20 లక్షలు కేటాయించారన్నారు. అప్పటి డీఈఓ వరలక్ష్మి నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ నిధులు వెనక్కు వెళ్లాయన్నారు. ఈ విషయంపై సమగ్రశిక్ష ఎస్పీడీని పలుమార్లు కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. అప్పట్లో 'సీస్' నిర్వహణపై హెచ్‌ఎంలకు శిక్షణ, 3 ,6, 9 తరగతుల విద్యార్థులకు సర్వే పరీక్షలు నిర్వహించామన్నారు. ఫీల్డ్ ఇన్విజిలేటర్లను నియమించామని, ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రెమ్యునరేషన్ తామే చేతినుంచి ఇచ్చామన్నారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. చేతి నుంచి ఖర్చు పెట్టిన ఎమ్మార్సీ సిబ్బంది, ఎంఈఓ-2లకు ఎగ్జామినేషన్ రెమ్యునరేషన్, ఇతర అలవెన్సులు ఇవ్వలేదన్నారు. అధికారులు చేసిన తప్పులకు తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర అధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఆర్‌ఈఎఫ్) రాయలసీమ గౌరవాధ్యక్షులు రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు ముత్యాల రాజ్ పాల్గొన్నారు.

12 నుంచి రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

బత్తలపల్లి: రామాపురంలో సెప్టెంబర్ 12 నుంచి పదో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన బత్తలపల్లిలో మీడియాకు వివరాలు వెల్లడించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గ్రామపెద్దల సహకారంతో మూడు రోజులపాటు రామాపురం ఉన్నతపాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ బాల, బాలికల జట్లు పాల్గొంటాయన్నారు. 11వ తేదీ నాటికి జట్లన్నీ రామాపురం చేరుకుంటాయన్నారు. పోటీల నిర్వహణకు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.

స్నానానికెళ్లి.. మృత్యు ఒడికి

● మృతుడు కర్నూలు జిల్లావాసి

వజ్రకరూరు: హంద్రీ-నీవా కాలువలో స్నానానికి దిగి గల్లంతైన వ్యక్తి మృతి చెందాడు. నాలుగు రోజుల తర్వాత మృతదేహం బయటపడింది. మృతుని కుమారుడు శివరాజు వజ్రకరూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన ఎస్.బసన్నగౌడ్ (53) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 27న గుంతకల్లు మండలం కసాపురం వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వచ్చాడు. అదే రోజు గుంతకల్లు సమీపంలోని హంద్రీ-నీవా ప్రధాన కాలువ వద్ద స్నానం చేయడానికి గట్టుపైనే బట్టలు ఉంచి దిగిన బసన్నగౌడ్ నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. కొంతసేపటి తర్వాత అటుగా వచ్చిన ఓ వ్యక్తి గట్టుపై బట్టలు గమనించి పరిశీలించగా.. ఆధార్ కార్డు కనిపించింది. అందులోని ఫోన్ నంబర్‌కు కాల్ చేసి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకుని బసన్నగౌడ్ కోసం గాలించారు. ఎక్కడా కనిపించలేదు. శనివారం వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద ఉన్న హంద్రీ-నీవా ఎత్తిపోతల వద్ద మృతదేహం బయటపడింది. ఎత్తిపోతల అధికారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నాగస్వామి పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. కుటుంబ సభ్యులు వచ్చి బసన్నగౌడ్ మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బసన్నగౌడ్‌కు భార్య జయమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఎస్కేయూ క్రీడా వేదికల ఖరారు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించనున్న క్రీడా పోటీల వేదికలను ఖరారు చేశారు. ఎస్కేయూలో శనివారం ఫిజికల్ ఎడ్యుకేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.అనిత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రూప్-ఏ పోటీలు ఎస్వీ డిగ్రీ కళాశాల (అనంతపురం), గ్రూప్-బీ పోటీలు బీఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కళ్యాణదుర్గం), గ్రూప్-సీ పోటీలు ఎస్ఎస్‌జీఎస్ కళాశాల (గుంతకల్లు), అథ్లెటిక్స్ అండ్ ఉమెన్ గేమ్స్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అనంతపురం)లో నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ బి.జెస్సీ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ ప్రక్రియ వేగవంతం చేయాలి

అనంతపురం అగ్రికల్చర్: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. శనివారం నగరంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏఓలు, ఏడీఏలతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు నెలాఖరుకు 50 శాతం ఈ-క్రాప్ పూర్తి చేయాలని టార్గెట్ పెట్టుకున్నా.. ఒక్క మండలంలో కూడా సాధించలేకపోవడంపై పలువురు ఏఓలు, ఏడీఏలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మండలాల్లో 20 నుంచి 30 శాతం దగ్గర ఆగిపోవడం, వివిధ కారణాలతో 40 గ్రామాల్లో ఇంకా ఈ-క్రాప్ మొదలు కాకపోవడంపై మండిపడ్డారు. పంటల వారీగా సాధారణ సాగు విస్తీర్ణం, సాగైన విస్తీర్ణం లెక్కలపై కూడా కొందరు ఏఓలు స్పష్టత ఇవ్వకపోవడంతో నిలదీశారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిస్తూ... ఇపుడున్న పరిస్థితుల్లో పొలంబాటతో రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరుకు వందశాతం ఈ-క్రాప్ పూర్తి కావాలన్నారు. ఎక్కడా యూరియా కొరత ఏర్పడకుండా నిఘా పెంచాలన్నారు. ఖరీఫ్ పంటల సాగు 65 శాతం పూర్తయిందని, మిగతా విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటల స్థితిగతులు, వాటికి ఆశించిన చీడపీడలు, తెగుళ్ల నివారణ, రసాయన ఎరువులు తగ్గించి జిప్సం వాడకం పెంచడం, ప్రత్యామ్నాయ పంటల సాగు గురించి రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే), రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం (ఏఆర్‌ఎస్) ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ సాదినేని మల్లీశ్వరి, డాక్టర్ ఎం.విజయశంకరబాబు అవగాహన కల్పించారు. పంటలన్నీ కీలకదశలో ఉన్నందున రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సస్యరక్షణ సిఫారసులు ఇవ్వడానికి ఆర్‌ఎస్‌కే స్థాయి నుంచి అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, యాంత్రీకరణ, పొలంపిలుస్తోంది, విత్తన పంపిణీ, పొలంబడి, ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళిక తదితర అంశాలపై సమీక్షించారు.

భర్త, కుమారుడు అదృశ్యం

అనంతపురం: తన భర్త, కుమారుడు అదృశ్యమయ్యారని ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. శారదనగర్‌లో నివాసముంటున్న ఎం.అరుణజ్యోతి ఓ ప్రైవేట్ స్కూలులో పనిచేస్తోంది. ఈమెకు 2021లో కనగానపల్లి మండలం కొండపల్లికి చెందిన కె.గంగాధర్(జెడ్పీలో వర్క్ ఇన్‌స్పెక్టర్)తో వివాహమైంది. వీరికి కూతురు యోగశ్రీ, కొడుకు విక్రుత్ సంతానం. అదనపు కట్నం కోసం భర్త వేధిస్తుండటంతో అరుణజ్యోతి గత ఏడాది ఏప్రిల్‌లో పిల్లలతో సహా పుట్టింటికి వచ్చేసింది. అయినా భర్త ప్రవర్తనలో మార్పు లేకపోగా.. అదనపు కట్నం వేధింపులు మరింత పెరిగిపోవడంతో భరించలేకపోయిన ఆమె ఈ నెల 28న మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ సమయంలో విచారణ నిమిత్తం వచ్చిన భర్త స్టేషన్ బయట కుమారుడితో ఆడుకుంటూ ఉన్నాడు. అరుణజ్యోతి స్టేషన్‌లోకి వెళ్లి బయటకు వచ్చేలోపు భర్త, కుమారుడు కనిపించలేదు. భర్తకు ఫోన్ చేస్తే సెల్ స్విచాఫ్ వచ్చింది. తన భర్త, కుమారుడి ఆచూకీ కనిపెట్టాలని అరుణజ్యోతి శనివారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

కసాపురంలో ఇంటింటా ఫీవర్ సర్వే

సాక్షి ఎఫెక్ట్..

గుంతకల్లు రూరల్: కసాపురంలో శనివారం వైద్య ఆరోగ్య సిబ్బంది ఫీవర్ సర్వే చేపట్టారు. గత నెల రోజులుగా ప్రజలు జ్వరాలబారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో 'వణికిస్తున్న జ్వరాలు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. శనివారం ఉదయాన్నే వైద్య సిబ్బంది గ్రామానికి చేరుకొని ఇంటింటికీ తిరిగి జ్వరాలతో బాధ పడుతున్న వారి నుంచి రక్తనమూనాలు సేకరించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతో పాటు వాటిబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మరో వైపు గ్రామంలో పారిశుధ్య పనులను చేపట్టారు. గుత్తి మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్, పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ వినయ్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి హెచ్చరించారు. శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు అనుమతి లేకుండా నడిపితే ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. లింగ నిర్ధారణకు పాల్పడినట్లు తేలితే జరిమానాతో పాటు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ యుగంధర్, డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ నారాయణస్వామి, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్, గైనకాలజిస్టు డాక్టర్ పద్మశ్రీ, పెథాలజిస్టు డాక్టర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


కాలువ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయిస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

ఆత్మకూరు: జిల్లా కేంద్రం అనంతపురంలో కొలువైన భారీ వినాయక విగ్రహాలను పంపనూరు సమీపంలోని హంద్రీ–నీవా కాలువలో నిమజ్జనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో శనివారమే ఆత్మకూరు ఎస్‌ఐ లక్ష్మణరావు, పోలీసు సిబ్బంది, ఇతర శాఖల అధికారులు హంద్రీనీవా కాలువ వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భారీ విగ్రహాల నిమజ్జనానికి వీలుగా పెద్ద పెద్ద క్రేన్, జేసీబీలను అందుబాటులో ఉంచారు. రాత్రి వేళ సమస్య తలెత్తకుండా పెద్ద ఎత్తున విద్యుత్ లైట్లను ఏర్పాటు చేశారు. రోడ్డు పైనుంచి కాలువలోకి విగ్రహాలు వేయడానికి వీలుగా ఐరన్ షీట్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా పిల్లలు, పెద్దలు కాలువ లోపలికి వెళ్లకుండా రోడ్డుకిరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం జరిగే ఆదివారం రోజున గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతామని ఎస్‌ఐ తెలిపారు.

పవర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం: పీఎం కుసుమ్ యోజన కింద పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం అవసరమైన స్థలం కోసం శనివారం సాయంత్రం చెన్నంపల్లిలో కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. సర్వే నంబర్ 103లోని 50 ఎకరాల భూములకు సంబంధించిన వివరాలను రెవెన్యూ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో సోలార్ 12 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ కోసం ప్రైవేటు భూమిని రైతుల ద్వారా కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా భూమి విక్రయించిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులకు ప్లాంట్ ఏర్పాటుపై పలు సూచనలు ఇచ్చారు. ఆ తర్వాత గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మన్, మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ ప్రతినిధులు, ఏడీ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కొడుకు కోసం ఓ రైతు' ప్రదర్శన

అనంతపురం కల్చరల్: 'కొడుకు కోసం ఓ రైతు' చిత్రాన్ని ఆదివారం ప్రదర్శించనున్నారు. నగరానికి చెందిన సీనియర్ కళాకారుడు కత్తి విజయ్ కుమార్ సారథ్యంలో చిత్రం రూపుదిద్దుకుంది. ప్రభుత్వ విధానాలతో అల్లాడిపోతున్న రైతు ఎదుర్కొనే కష్టాలు,కడగండ్లే ఈ చిత్ర ఇతివృత్తం. శనివారం లలిత కళాపరిషత్తు కార్యదర్శి గాజుల పద్మజ చిత్ర పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో ప్రతిభ కలిగిన కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రేమ, ఆప్యాయతలు లేని కొడుకులు, పంటలు పండక అప్పుల పాలవుతున్న రైతుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయన్నారు. వీటన్నింటిని జీఎంఎస్ గ్యాలరీ ఫిలిమ్స్ వారు అద్భుతంగా తెరకెక్కించారని ప్రశంసించారు. కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలను చేపట్టిన కత్తి విజయ్‌కుమార్ కృషి కచ్చితంగా అందరినీ అలరిస్తుందన్నారు. అవార్డులను తెచ్చిపెడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తరిమెల రాజు, నెహల్, పవన్ అద్భుతంగా నటించారన్నారు. ఆదివారం ఉదయం స్థానిక నీలిమా థియేటర్‌లో ఉదయం 8.30 గంటలకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

నిధులు జాస్తి.. నాణ్యత నాస్తి

ఇది అనంతపురం నగరంలోని శ్రీనగర్ కాలనీలో నీరు –ప్రగతి పార్క్ వద్ద ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు. ఎన్ క్యాప్ నిధులు రూ.2.3 కోట్లతో రోడ్డు, డివైడర్ల పనులు చేయాలని గతేడాది జూలై 26న టెండర్లు పిలిచారు. అదే ఏడాది అక్టోబర్ 10న పనులు ప్రారంభించారు. పనులు పూర్తి చేయడానికి ఐదు నెలలకు పైగా పట్టింది. కానీ 6 నుంచి 8 నెలలు కాకమునుపే రోడ్డులో కంకర తేలింది. ఎర్త్‌వర్క్ సరిగా లేకపోవడంతో రోడ్డు వంకర టింకరగా ఉంది. డివైడర్లను నాణ్యతగా, క్రమ పద్ధతిలో నిర్మించలేదు. వాటిలో అప్పుడే పగుళ్లు వచ్చాయి. టీడీపీ ప్రజాప్రతినిధి అనుచరులే సబ్‌లీజు కింద పనులు చేసి భారీగా సొమ్ము చేసుకున్నారు. అదేవిధంగా శ్రీనగర్ కాలనీలో రూ.38 లక్షల వ్యయంతో మీటర్ వెడల్పు, 280 మీటర్ల పొడవుతో కాలువ ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను నాణ్యతగా చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



ఇది అనంతపురం నగరంలోని రంగస్వామి నగర్‌కు వెళ్లే రోడ్డు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో గుంతలు పడ్డ రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని ఈ ఏడాది మార్చిలో రూ.47 లక్షలతో టెండర్లు పిలిచారు. 275 గుంతలను పూడ్చాలని నిర్ణయించారు. కాంట్రాక్టర్ పైపై పూతలు వేసి వదిలేయడంతో నెలల వ్యవధిలోని రోడ్లన్నీ యథాస్థితికి చేరాయి. గుంతల్లో బ్యాలెన్స్ తప్పి వాహనదారులు, పాదచారులు కిందకు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. సోమనాథ్ నగర్‌తో పాటు నగరంలోని సప్తగిరి సర్కిల్, తిలక్ రోడ్డు, నీరుగంటి వీధి, సాయినగర్, అశోక్‌నగర్, హౌసింగ్ బోర్డు, లక్ష్మీనగర్, తదితర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి.



- అభివృద్ధి పనుల్లో డొల్లతనం బట్టబయలు
- నెలల వ్యవధిలోనే దెబ్బతింటున్న పనులు
- ఇదీ నగర పాలక సంస్థలో దుస్థితి

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో నగర పాలక సంస్థలో అభివృద్ధి అటకెక్కింది. అరకొరగా చేసిన పనుల్లోనూ నాణ్యత లోపించింది. రూ.కోట్లతో చేపట్టిన పనులు నెలల వ్యవధిలోనే తేలిపోయాయి. తెలుగు తమ్ముళ్లు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని కొల్లగొట్టారు. గుంతల్లో బ్యాలెన్స్ తప్పి వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు.


శ్రీనగర్ కాలనీలో నెలల వ్యవధిలోనే దెబ్బతిన్న డివైడర్


అనంతపురం లక్ష్మీనగర్‌లో అధ్వానంగా ఉన్న రోడ్డు

నెల రోజులు కాకముందే గుంతలు



నెలల తరబడి రోడ్లు గుంతలు గుంతలుగా ఉన్నాయి. రోడ్డుపైకి వాహనం వెళితే చాలు దడ దడ అంటూ ఇబ్బంది పడాల్సి వస్తోంది. చాలా మంది గుంతల్లో బ్యాలెన్స్ చేయలేక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టనట్లు ఉన్నారు. మరీ ఇంత అధ్వానంగా ఉంటే ఎలా?

–రామాంజినేయులు, రజక సంఘం నేత, అనంతపురం

కంకర వేసి వదిలేశారు




రోడ్డు ఏర్పాటు చేస్తామని గుంతలు తీసి నాలుగు నెలలవుతోంది. కంకర మాత్రం వేసి వదిలేశారు. ఇలాగైతే పనులు ఎలా చేసుకోవాలి? వాహనాలను ఏర్పాటు చేసుకోవడానికి వీల్లేకుండా పోయింది. వ్యాపారాలు జరిగే పరిస్థితి లేదు. నగరంలోనే ఇటువంటి పరిస్థితి ఉంటే.. మారుమూల ప్రాంతాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

– ఆంజినేయులు, సోమనాథ్‌నగర్, అనంతపురం

ఆత్మకూరులో హైఓల్టేజీ విద్యుత్

- కాలిపోయిన టీవీలు, ఫ్యాన్లు, బల్బులు

ఆత్మకూరు: హైఓల్టేజీ విద్యుత్ ప్రసారం కావడంతో ఆత్మకూరులోని పలు ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, బల్బులు కాలిపోయాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..వినాయక నిమజ్జనం సందర్భంగా శుక్రవారం రాత్రి విగ్రహాలు తీసుకెళ్తున్న సమయంలో ఆత్మకూరు ప్రధాన రహదారికి ఒక వైపు ఉన్న పలు కాలనీలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. కొద్దిసేపటి తర్వాత ఉన్న ఫలంగా హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో ఇళ్లలోని వందలాది టీవీలు, లైట్లు, ఫ్యాన్లు కాలిపోయాయి. శుక్రవారం రాత్రి 12 గంటలకు విద్యుత్ సరఫరా నిలిచినా... మళ్లీ హైఓల్టేజీతో విద్యుత్ సరఫరా కావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దీనిపై విద్యుత్ ఏఈ దాస్‌ను వివరణ కోరగా.. ట్రాన్స్‌ఫార్మర్‌లో పుష్షింగ్ రాడ్ సమస్య వల్ల హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అయి ఉండవచ్చన్నారు. ఫేస్ టూ ఫేస్ విద్యుత్ రావడం వల్ల సమస్య తలెత్తిందన్నారు.


హైవోల్టేజీ వల్ల ఒకే ఇంట్లో కాలిపోయిన విద్యుత్ బల్బులు

అనుమతి లేకుండా ఎరువులు అమ్మితే చర్యలు

అనంతపురం: అనుమతి లేకుండా ఎరువులు అమ్మితే చట్టపరంగా చర్యలు తప్పవని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. శనివారం నగరంలోని శ్రీచైతన్య ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రీలక్ష్మీరంగ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో వారు తనిఖీలు చేశారు. రూ.1.15 లక్షల విలువ చేసే 14:35:14 ఎరువులు, రూ.1.08 లక్షల విలువ చేసే 10:26:26 ఎరువులను అమ్మకాలు జరపకుండా నిలుపుదల చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ఎం.నాగభూషణం, ఎస్‌ఐ జి.గోపాలుడు, వ్యవసాయాధికారి వాసు ప్రకాష్, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు ఎవరినీ కొట్టలేదు

- సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేస్తే చర్యలు
- అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు

రాప్తాడు: వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ఈనెల 29న బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లిలో పోలీసులు ఎవరినీ కొట్టలేదని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు స్పష్టం చేశారు. శనివారం ఆయన రాప్తాడులోని అనంతపురం రూరల్ డీఎస్పీ కార్యాలయంలో సీఐ పుల్లయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చెన్నంపల్లిలో పోలీసులు కొందరిని కొట్టినట్లు సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత నిమిత్తం పీఎస్‌ఐ కళ్యాణ్, మరో కానిస్టేబుల్ చెన్నంపల్లికి వెళ్లారన్నారు. ఆ గ్రామంలోనే మరోచోట సీఐ పుల్లయ్య కూడా బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. వినాయకుడి విగ్రహం ఊరేగింపు సందర్భంగా యువకులు పోలీసులపై కూడా రంగులు చల్లారన్నారు. అయినా పోలీసులు వారిని ఏమీ అనలేదన్నారు. కేవలం చీకటిపడేలోపు నిమజ్జనం పూర్తి చేయాలన్న ఉద్దేశంతోనే ఊరేగింపు త్వరగా పూర్తి చేయాలని సూచించడంతో ఓ వ్యక్తి వచ్చి ఎందుకని త్వరగా పంపిస్తున్నారని ప్రశ్నిస్తూ..పీఎస్‌ఐ కళ్యాణ్ కాలర్ పట్టుకున్నాడన్నారు. విషయం తెలుసుకున్న సీఐ పుల్లయ్య ఘటన స్థలానికి చేరుకుని, పోలీసుల మీద దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా.. గ్రామంలోని కొందరు మహిళలు అడ్డుపడ్డారన్నారు. దీంతో పోలీసులు ఎవర్నీ ఏమీ అనకుండా మహిళలను ఇళ్లకు పంపారన్నారు. అయినా ఈ ఘటనలో పోలీసులను ఇరికించాలన్న లక్ష్యంతో కొందరు వ్యక్తులు.. పోలీసులు కొట్టినట్లు ప్రచారం చేస్తున్నారని, అది కరెక్ట్ కాదన్నారు.ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారించి తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ స్పష్టం చేశారు. అంతవరకూ పుకార్లు వ్యాప్తి చేయకుండా ఉండాలన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశులు

మహాగణపతిం.. మనసా స్మరామి

- గణేశుడి మండపాల వద్ద కోలాహలం
- విఘ్ననాయకుడి దర్శనానికి క్యూ కడుతున్న ప్రజలు


ఎర్రనేలకొట్టాలలో బాలరాముడి ఆకారంలో లంబోదరుడు


రాప్తాడు: ఇందిరమ్మ కాలనీలో గజముఖ మహాగణపతి


అనంతపురం రాణినగర్‌లో కొలువుదీరిన గణేశుడు


ఉమానగర్‌లో సీతాకోకచిలుక వినాయకుడు

అనంతపురం కల్చరల్: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. నగరమంతటా బహురూపాల్లో వినాయకుడు సందడి చేస్తున్నాడు. ఈ క్రమంలో నగరం ఆధ్యాత్మిక సాగరంలో మునిగింది. పాతూరు రాణినగర్, కమలా నగర్, మొదటిరోడ్డు, రామనగర్ ప్రాంతాల్లో భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుంటున్నారు. వాడవాడలా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజలు, భక్తిగీతాలపనలు, సాంస్కృతిక సంబరాలు ఆనందోత్సాహాలను నింపుతున్నాయి.

నిమజ్జనం సాగనుందిలా :
వినాయకులను ఆదివారం నిమజ్జనం చేయడానికి భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. సాయంత్రం 5 గంటలకు సప్తగిరి సర్కిల్‌లో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక సమావేశంలో మేయర్ వసీం, ఎస్పీ జగదీష్ ముఖ్య అతిథులుగా పాల్గొని వినాయక చవితి ఉత్సవాలకు ధ్వజ అవరోహణంతో ముగింపు పలుకుతారు. శోభాయాత్రను ప్రారంభిస్తారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం నుంచి రాజు రోడ్డు, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్డు, తాడిపత్రి బస్టాండు, గాంధీబజార్, టవర్‌క్లాక్ మీదుగా బళ్లారి రోడ్డు వరకు శోభాయాత్ర సాగనుంది.

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీ చిన్మయనగర్‌లో వెలసిన వినాయకులు నాలుగు రోజుల నుంచి ప్రత్యేక పూజలు అందుకుంటున్నారు. విఘ్నరాజా కరుణ జూపుమా అంటూ భక్తులు స్వామివారిని వేడుకున్నారు. శనివారం రాత్రి ఆయా విగ్రహాల వద్ద వినాయక కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. అనంతరం లడ్డు వేలం వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు అందరినీ అలరించాయి. శనివారం మండలంలోని చిన్మయనగర్‌లో వెలసిన వినాయక మండపాలను సీఐ శ్రీహర్ష సందర్శించి నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని కమిటీ నిర్వాహకులకు సూచించారు.


అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో వినాయక మండపం వద్ద భక్తుల కోలాహలం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సేవాదృక్పథం అభినందనీయం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి


వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అన్నం వడ్డిస్తున్న అనంత

అనంతపురం కార్పొరేషన్: సేవాదృక్పథం అభినందనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నాయక్‌నగర్‌లో 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్ర ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దాదు, మైను, అంజలి, ఉష, లింగమయ్య, రితేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

అనంతపురం: నగరంలో ఆదివారం వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు డీఎస్పీ వి. శ్రీనివాస రావు పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి. లారీలు, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు , ఇతర భారీ వాహనాలు నగరంలో ట్రాఫిక్ దృష్ట్యా నిర్దేశించిన రోడ్డు మార్గాల గుండా వెళ్లాలి.

- తపోవనం సర్కిల్ నుంచి హైవే, తడకలేరు మీదుగా మార్కెట్ యార్డ్, మిర్చి యార్డ్, ఆర్టీసీ బస్టాండ్.
- రవి పెట్రోల్ బంక్ నుంచి బెంగళూరు హైవే
- రుద్రంపేట సర్వీసు రోడ్డులో గల రాజహంస అపార్ట్‌మెంట్ నుంచి హైదరాబాద్ హైవేకు
- పంగల్ రోడ్డు నుంచి రాప్తాడు నేషనల్ హైవేకు వెళ్లొచ్చు.
- కలెక్టరేట్ ఆఫీసు నుంచి చెరువు కట్ట మీదుగా ఎన్టీఆర్ మార్గ్, తాడిపత్రికి వెళ్లొచ్చు.
- మేడా పెట్రోల్ బంకు, గుత్తి రోడ్డు నుంచి ఎన్టీఆర్ మార్గ్, తాడిపత్రికి వెళ్లొచ్చు.
- ఆర్టీసీ బస్టాండు నుంచి చంద్ర హాస్పిటల్, మిర్చియార్డు గుత్తి రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ వైపు వెళ్లొచ్చు. అలాగే కదిరి వైపు, ధర్మవరం వైపు వెళ్లొచ్చు.

సర్వేపల్లి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం కల్చరల్: డాక్టర్ సర్వేపల్లి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ అకాడమీ వ్యవస్థాపకులు ఈఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. కేవలం విద్యారంగమే కాకుండా వివిధ రంగాల్లో గురువులుగా రాణిస్తున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గలవారు సెప్టెంబర్ 4 లోపు దరఖాస్తులను 'ఆల్ ది బెస్టు అకాడమీ, డోర్ నం.1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం, సికింద్రాబాద్ -15' చిరునామాకు పంపాలన్నారు. వచ్చే నెల 7న హైదరాబాదులో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుక సభలో పురస్కారాలనందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9652347207 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

స్కేటింగ్ పోటీల్లో సత్తా



తేజాన్విత

అనంతపురం: నగరంలోని కమలా నగర్‌కు చెందిన ఐదేళ్ల చిన్నారి తేజాన్విత స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటింది. ఈ నెల 21 నుంచి 24 వరకు కాకినాడలోని డాక్టర్ వైఎస్సార్ క్రీడా మైదానంలో ఏపీ రెండో ఓపెన్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. తేజాన్విత రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ఈ చిన్నారి స్థానిక రోటరీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో యూకేజీ చదువుతోంది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

శింగనమల: నార్పలలోని సీపీఐ కాలనీలో నివాసం ఉంటున్న హనీఫ్ కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించాడు. బంధువులు అతడిని ఆటోలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్కారాయుళ్ల అరెస్ట్

పామిడి: మండల కేంద్రంలో పలువురు మట్కా రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. బస్టాండ్ ప్రాంతంలో మట్కా ఆడుతున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు బస్టాండ్ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. పోలీసులను గమనించి పారిపోతున్న వారిని వెంబడించి మరీ ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మట్కా చీటీలతో పాటు రూ.1,13,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు.